క్లుప్తంగా

నేడు వాలీబాల్ పోటీలు

కమలాపురం: మండలంలోని పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ ఎల్పీ సునీల్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలను తమ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

జమ్మలమడుగురూరల్(పెద్దముడియం): రాష్ట్ర స్థాయి టెన్నిస్, టేబుల్ టెన్నిస్‌కు పెద్దముడియం మండలంలోని ఎస్. కొట్టాలపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖాధికారి చౌడయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యు. శివ కుమార్, పీడీ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు: కడప పట్టణంలోని మునిసిపల్ స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్ 19 జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా సోమవారం జరిగిన జూడో, రెజ్లింగ్ పోటీల్లో వల్లూరు పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

అదుపు తప్పి లారీ బోల్తా



రోడ్డు పక్కన బోల్తా పడిన లారీ

కమలాపురం: కడప–తాడిపత్రి ప్రధాన రహదారిపై మండంలలోని టి. చదిపిరాళ్లలోని సాయిబాబా ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు లారీ అదుపు తప్పిబోల్తా పడింది. సోమవారం తమిళనాడు నుంచి ప్రొద్దుటూరు కొవ్వూరు ట్రాన్స్‌పోర్ట్‌కు వెళ్తున్న ఒక లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన జరిగే సమయంలో రోడ్డుపై ప్రమాణీకులెవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఆర్టీపీపీలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఏపీఎస్పీ జేఏసీ పిలుపు మేరకు సోమవారం ఆర్టీపీపీ పవర్ హౌస్ గేటు వద్ద నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. జేఏసీ పిలువుపు మేరకు ఈ నెల 15వ తేదీ నుంచి 22వ తేది వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. యజమాన్యం తన డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళనలు దశలవారీగా చేపబడుతామని ప్రకటించారు.

జీఓను వెనక్కి తీసుకోవాలి

పులివెందుల టౌన్ : పాఠశాలల్లోకి విద్యార్థుల తల్లిదండ్రులను, ఎస్ఎంసీ సభ్యులను తప్ప.. ఇంకెవరూ లోపలికి అనుమతించొద్దని డైరెక్టర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ విడుదల చేసిన జీఓను వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఏ జిల్లా నాయకుడు సి.దినేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పులివెందులలో ఆయన ఒక ప్రకటన ద్వారా మెగా పేరెంట్స్ మీట్ పేరుతో పాఠశాలల్లో కేంద్రంగా మార్చుకుంటున్నారని, ఆ సమావేశాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థి సంఘాల నాయకులు తెలుసుకోవాలంటే లోపలికి వెళ్లాలన్నారు. ఇప్పటివరకు ఇలాంటి నిర్ణయాలు అధికారంలోకి వచ్చిన వారెవరూ తీసుకోలేదని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నిర్ణయం తీసుకుందని, ప్రభుత్వం ఎందుకో భయపడుతోందన్నారు.

పరామర్శ



కేశవరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల కేంద్రమైన యర్రగుంట్ల పట్టణంలోని వేంపల్లి రోడ్డులో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లు వెంకటకేశవరెడ్డిని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మల్లు వెంకటకేశవరెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి, వెంకటకేశవరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్యతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సిబ్బంది కావలెను!

- పోలీసుశాఖలో వేధిస్తున్న కొరత
- కేసుల దర్యాప్తులోనూ ఇబ్బందులు
- ఒత్తిడితో సతమతమవుతూనే విధులు

కొండాపురం: కొండాపురం పోలీస్ సర్కిల్ పరిధిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కొన్నేళ్లుగా నియామకాలు లేవు. దీంతో ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. పోలీసులపై పనిభారం పెరగడంతోపాటు కేసుల దర్యాప్తుపైనా ఆ ప్రభావం పడుతోంది. కొండాపురం మండలంలో ఒక సెయిల్ కంపెనీ, పవర్ హైడ్రా కంపెనీలు నిర్మాణంలో ఉన్నాయి. గతంలో ఆ సంస్థలతో పలు ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం సెయిల్ కంపెనీలో వరుస చోరీలు జరుగుతున్నాయి. మండలంలో ఫ్యాక్షన్ గ్రామాలు కూడా ఉన్నాయి. గండికోట జలాశయంలో గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. మండలవ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. గుట్కా, మట్కా, పేకాట స్థావరాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. తాళ్లప్రొద్దుటూరు, కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరతతో కేసుల దర్యాప్తుల్లో జాప్యం జరుగుతోంది. ఆయా ప్రాంతాల పరిధిలో బీట్లు, నిఘా, రాత్రి గస్తీ, చోరీలు, నేరస్తుల కదలికలపై నిఘా మరోవైపు బెయిల్ తదితర వాటిపై ఆరా తీయాల్సి ఉంటుంది. చోరీలు, అదృశ్యం కేసులు, ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు పూర్తి అయితేనే న్యాయస్థానంలో చార్జీషీట్లు దాఖలు చేయడానికి సాధ్యమవుతుంది. వీటితో పాటు రోజూ పలు కేసులు వస్తుంటాయి. పోలీసుస్టేషనల్లో విధులతోపాటు బందోబస్తు , ఉత్సవాలు, ఇతరత్రా ఘటనలు జరిగిన సమయంలో అక్కడికి పంపుతారు. దీంతో చాలమంది తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్నారు. విశ్రాంతి లేక కొందరు పోలీస్‌సిబ్బంది సెలవుల మీద వెళ్లుతున్నారు.

కేసుల దర్యాప్తుపై ప్రభావం

సిబ్బంది కొరత ప్రభావం కేసుల దర్యాప్తుపైనా పడుతోంది. సిబ్బందిని సకాలంలో ఘటనా స్థలాలకు పంపించడం, అక్కడ ప్రత్యక్ష సాక్షులను విచారించడంతో పాటు నిందితుల కోసం గట్టి నిఘా ఏర్పాటు వంటివి చేయాల్సి ఉంటుంది. ఈ కేసుల దర్యాప్తు సాగుతుండగానే మళ్లీ రోజువారీ నేరాల దర్యాప్తు, నిందితుల వివరాలను సేకరించడం వంటి పనులు ఉంటాయి. తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్ఐ, కానిస్టేబుళ్లు 16 మంది, ఇద్దరు ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు–5, పోలీస్ సిబ్బంది ఉండాలి. ఎస్ఐ ఇటీవల మెడికల్ లీవ్‌పై వెళ్లారు. ఇద్దరు ఏఎస్ఐలు ఉన్నారు. కానిస్టేబుళ్లు 16 మందిగాను ఐదుగురు మాత్రమే ఉన్నారు అందులో ఒకరు మండలంలోని టి.కోడూరు గ్రామంలో పికెట్, మరొకరు కలమల్ల స్టేషన్ పరిధిలో పికెట్‌లో ఉన్నారు. ఒక కానిస్టేబుల్ కోర్టుకు వెళుతుంటారు. స్టేషన్‌లోనే ఒక కానిస్టేబుల్ (సీసీటీఎన్ఎస్) కంప్యూటర్ విధులు నిర్వర్తిస్తున్నాడు. మరో కానిస్టేబుల్ స్పెషల్‌పార్టీ విధుల్లో ఉన్నాడు. సరిపోను సిబ్బంది లేక హెడ్ హెడ్ కానిస్టేబులే సెంట్రీ డ్యూటీ చేస్తున్నాడు. శాంతిభద్రతల పరిరక్షణలో పెట్రోలింగ్ టీమ్‌లది కీలక పాత్ర. పగలు, రాత్రి ఈ టీమ్‌లు ఎంత ఎక్కువ తిరిగితే ప్రజలు అంత అలర్ట్‌గా ఉంటారు. డయల్100 కాల్స్ అటెంట్ చేయాలన్నా, దొంగతనం, గొడవలు, రోడ్డు ప్రమాదాలు, ఇలా ఎలాంటి ఘటనలకైనా పెట్రోలింగ్ టీమ్‌లే ముందుటాయి. ప్రస్తుతం సిబ్బంది కొరతతోపెట్రోలింగ్ టీమ్‌ల సంఖ్య తగ్గిపోయింది.

కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో..

కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు ఏఎస్ఐలు ఉండాలి. కానీ ఒకరు మాత్రమే ఉన్నారు. మొత్తం 18 మంది కానిస్టేబుల్ ఉండాల్సి ఉండగా ఆరుగురే ఉన్నారు. వీరిలో ఇద్దరు కడపకు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి పోలీస్ సిబ్బందిని నియమించి శాంతి భద్రతలను కాపాలని మండల ప్రజలు, నాయకులు కోరుతున్నారు.



తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్

ప్రభుత్వ వైఖరి సరికాదు



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

వల్లూరు: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ మండలంలోని ఆశాఖ ఉద్యోగులు సోమవారం వల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రఘురాంకు వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా మన మిత్ర డోర్ టు సర్వే సచివాలయ ఉద్యోగులు నిర్వహించాలంటూ ఆదేశాలు రావడం పట్ల వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఉద్యోగులు తమ బాధను పలుమార్లు అధికారులకు వినతి పత్రాల ద్వారా తెలిపినప్పటికీ ఎలాంటి స్పందన లేదని, గతంలో ఒక వాలంటీర్ ఒక క్లస్టర్‌లో విధులు నిర్వహించేవారని, ప్రస్తుతం ఒక సచివాలయ ఉద్యోగి ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్‌లలో విధులు నిర్వహించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోజు రోజుకూ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని మరింత దిగజారుస్తూ అధికార వర్గాలు ప్రవర్తిస్తున్న తీరును నిరసిస్తూ ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందజేసినట్లు సచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలి

సింహాద్రిపురం : గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వేలు నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజామొద్దీన్ వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు కేటాయించిన గృహాలలో ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించాలని, ఎవరికైనా జ్వరం ఉన్నట్లయితే వెంటనే రక్త పరీక్ష చేసి దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లేలా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ కుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది సింహాద్రిపురం వైద్యాధికారి డాక్టర్ కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ఇంటింటా ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొద్దీన్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన హెల్త్ సూపర్‌వైజర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాజా మొద్దీన్ మాట్లాడుతూ ఎవరికైనా జ్వరం ఉన్నట్లయితే వెంటనే రక్త పరీక్ష చేయాలని, అనారోగ్యంతో ఎవరైనా బాధపడుతుంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లేలా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. మీ పరిధిలోని ప్రభుత్వ హాస్టల్‌ను వారానికొకసారి సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమాచారం తెలుసుకోవాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ బాలాజీ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొద్దీన్

తాగునీటి కోసం మహిళల ఆందోళన

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని ఆజాద్ నగర్, హోమ్ గార్డ్ కాలనీ, చౌడేశ్వరీనగర్ కాలనీలకు రెండు రోజులుగా తాగునీరు రావడం లేదని సోమవారం చింతకొమ్మదిన్నె సచివాలయంలో మహిళలు నిరసన తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సమీప ప్రాంతాల్లో బోర్లు వేశారని, కానీ మోటార్లు బిగించలేదని తెలిపారు. నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కుళ్లాయిబాబుకు వినతిపత్రం అందజేశారు.

చర్యలు తీసుకుంటాం

తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు. స్థానిక అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందికి నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో పర్యటించి, మోటార్లకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు.



నీటి కోసం ఆందోళన చేస్తున్న మహిళలు

వైద్యరంగంలో ఫిజియోథెరపీ కీలకం

వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం సెక్రటరీ డాక్టర్ ఎం.ప్రభుదాస్



పులివెందుల : వైద్య రంగంలో ఫిజియోథెరపీ ప్రస్తుతం కీలక పాత్ర పోషిస్తోందని వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.ప్రభుదాస్ పేర్కొన్నారు. ఆదివారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ ఈఏఏ వారు విడుదల చేసిన లేఖ వెనక్కి తీసుకోవడం జరిగిందని, ఫిజియోథెరపిస్ట్ పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవచ్చని, పేరు చివర ఫిజియోథెరపిస్ట్ అని ఖచ్చితంగా పెట్టుకోవాలన్నారు. ఎన్‌సీఏహెచ్‌పి 2025 సర్క్యులర్ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అన్ని అనుమతులతో జీవో వచ్చిన తర్వాత కూడా ఫిజియోథెరఫిస్టులను అగౌరవపరిచేలా డీజీహెచ్ఎస్ బాధ్యతాయుతైన పదవిలో ఉండి సరైన అవగాహన లేకుండా లేఖలు రాయడమంటే పార్లమెంటు, కేంద్ర ప్రభుత్వ విధానాలను అ గౌరవపరచడమేనని పేర్కొన్నారు. ఫిజియోథెరఫిస్టకు ప్రస్తుతం దేశంలో మరింత గౌరవం, ప్రాధాన్యం లభించిందని, డాక్టర్ అనే ఉపనామం వినియోగించే హక్కును అధికారికంగా గుర్తించారని తెలిపారు. ఫిజియోథెరఫిస్టలు కూడా జనరల్ మెడికల్ ప్రాక్టీస్ చేయకుండా ఫిజియోథెరఫి చికిత్స మాత్రమే చేయాలన్నారు. ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

వేంపల్లె : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని జేఏసీ చైర్మన్ పుల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం విడతల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈనెల 17, 18వ తేదీలలో ప్రధాన కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టడం జరుగుతుందని, ఈనెల 19, 20వ తేదీలలో సర్కిల్ ప్రధాన కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని, ఈనెల 22న శాంతి ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న అన్ని ప్రారంభస్థాయి పోస్టులను తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు అబ్దుల్ సలీమ్, మల్లికార్జున, నాగేంద్ర ప్రసాద్, బాబావలి, నాగరాజు, లక్ష్మయ్య, రామ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

గబ్బిలాలు.. ఆ ఊరి దేవతా పక్షులు

పులివెందుల రూరల్: సాధారణంగా గబ్బిలాలు అంటే అందరికీ భయమే. అవి గ్రామాల్లో సంచరిస్తే అరిష్టంగా భావిస్తారు. వాటి అరుపులు కూడా అపశకునం అనుకుంటారు. కానీ పులివెందుల మండలం ఎర్రబల్లె గ్రామంలో ఆ ఊరి వాసులకు మాత్రం గబ్బిలాలు దశాబ్దాలుగా నేస్తాలు. గ్రామంలోని రావి చెట్టుకు వందల సంఖ్యలో వేలాడుతూ కనిపిస్తుంటాయి. చీకటి పడగానే గబ్బిలాలు ఆహార వేటకు బయలుదేరుతాయి. తిరిగి ఉదయం చెట్టు వద్దకు చేరుకుని సేద తీరుతుంటాయి. పగటి వేళలో వీటికి హాని తలపెట్టకుండా గ్రామస్తులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అంతేకాదు తమ గ్రామంలో పంటలు బాగా పండుతూ ఎంతో సుభిక్షంగా ఉన్నామని చెబుతుంటారు ఆ గ్రామస్తులు . ఆ పక్షులకి ఎటువంటి హాని జరగకుండా గ్రామస్థులు రక్షణగా ఉంటారు. అంతేకాదు, సాక్షాత్తు దేవతలే ఆ గబ్బిలాల రూపంలో తమ గ్రామంలో కొలువుతీరారని ఎర్రబల్లె వాసులు విశ్వసిస్తారు.



ఎర్రబల్లె గ్రామంలో చెట్టుకు వేలాడుతున్న గబ్బిలాలు

రైల్వే గేటును ఢీకొన్న లారీ

ముద్దనూరు: స్థానిక జమ్మలమడుగు రహదారిలో ఉన్న రైల్వేగేటును లారీ ఢీకొంది. ఈ సంఘటనలో రైల్వేగేట్లు పూర్తిగా ధ్వంసమైంది. సోమవారం దాల్మియా సిమెంటు కర్మాగారం నుంచి సిమెంటు లోడుతో కర్ణాటక రాష్ట్రానికి బయలుదేరిన లారీ ముద్దనూరు ఘాట్‌రోడ్డులోకి వచ్చేసరిగి బ్రేకుల పనిచేయలేదు. దీంతో ఘాట్‌రోడ్డు నుంచి దిగువ ప్రాంతం కావడంతో వేగం అదుపు చేసుకోలేక లారీ సుమారు ఒక కి.మీ ప్రయాణించి, స్థానిక రైల్వేగేట్లను ఢీకొని రైల్వే గేట్లను దాటిన తర్వాత లారీ ఆగింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. రైల్వే అధికారులు గేట్ల మరమ్మతులు చేపట్టారు.

సరైన పత్రాలు లేకపోతే వాహనం సీజ్

వేంపల్లె : వాహనాలకు సరైన పత్రాలు లేకపోతే సీజ్ చేస్తామని ఎస్ఐ తిరుపాల్ నాయక్ చెప్పారు. సోమవారం సాయంత్రం వేంపల్లెలోని రాయచోటి బైపాస్‌లో వాహనాలను ఎస్ఐ తిరుపాల్ నాయక్ తనిఖీ చేశారు. అలాగే సరైన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారందరూ సరైన రికార్డులు పెట్టుకొని వాహనాలను నడపాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వాహనదారులు సహకరించాలని కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలు నడిపితే అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భిన్నత్వంలో ఏకత్వానికి హిందీభాష దోహదం

వేంపల్లె : హిందీ భాష భిన్నత్వంలో ఏకత్వానికి దోహద పడుతుందని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్ అన్నారు. సోమవారం ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ 1,6 విభాగాల ఆధ్వర్యంలో జాతీయ హిందీ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కోనప్ప మాట్లాడుతూ హిందీ భాష వల్ల దక్షిణ ఆసియాలో ఎక్కడైనా మాట్లాడేందుకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలు రాసేందుకు సులభతరం ఉంటుందన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

పెండ్లిమర్రి: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పని సరిగా పాటించాలని రూరల్ సీఐ చల్లని దొర అన్నారు. సోమవారం మండలంలోని వెల్లటూరు గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రికార్డు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. అనంతరం మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ తప్పని సరిగా ధరించాలన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల తనిఖీలో రికార్డులు లేని 10 వాహనాలకు రూ.11,500 జరిమానా విధించారు.

సృజనాత్మకతే విద్యార్థికి వరం

పులివెందుల టౌన్ : సృజనాత్మకత, ఆవిష్కరణలే విద్యార్థికి నిజమైన వరమని బిర్లా కంపెనీ మేనేజర్ జయకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక లయోలా పాలిటెక్నిక్ (వైఎస్ఆర్ఆర్) కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని కళాశాలలో ఇంజనీరింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు వారి నైపుణ్యంతో తయారు చేసిన వివిధ విభాగాల 75 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బిర్లా కంపెని మేనేజర్ జయకుమార్, రెక్స్‌ఆంజలో హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో గొప్ప ఇంజనీర్లుగా ఎదగాలన్నారు. ఇంజనీరింగ్ యొక్క ప్రాముఖ్యత గూర్చి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బ్రిట్టో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను చూసి అభినందించారు. ఈ ప్రాజెక్టు నమూనాలను చూసేందుకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు వచ్చి సందర్శించారు. వాటి ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థుల ప్రతిభ

ఇంజనీరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ వారు నిర్వహించిన ఉపన్యాస పోటీలో టి.హమీద్ ప్రథమ బహుమతి, వ్యాసరచన పోటీలో ద్వితీయ బహుమతిని సాధించారు. బిర్లా కంపెనీ యాజమాన్యం జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీలో రాజశేఖర్‌రెడ్డి రెండవ స్థానం సంపాదించాడు.



మాట్లాడుతున్న బిర్లా కంపెనీ మేనేజర్ జయకుమార్

అంతుచిక్కని తెగులు.. అన్నదాతకు దిగులు

- చీనీచెట్లకు వైరస్
- మందులు వాడినా ఫలితం శూన్యం
- కుదేలవుతున్న రైతులు

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం చీనీతోటలకు పెట్టింది పేరు. ప్రధాన ఉద్యాన పంటగా చీనీ పంట సాగులో ఉంది. ఒక్కసారి సాగుచేస్తే దాదాపు 20ఏళ్లు ఆ పంట కొనసాగుతుంది. అటువంటి పంట అంతుచిక్కని తెగులుతో కాయలు రాలిపోతున్నాయి. ఏమి చేస్తే పంట దక్కుతుందో అర్థం కావడం లేదని రైతులు మదనపడుతున్నారు. సింహాద్రిపురం మండల వ్యాప్తంగా 8వేల ఎకరాల్లో చీనీ పంటను సాగు చేశారు. అకాల వర్షాల కారణంగా చీనీ చెట్లకు కొమ్మ తెగులు సోకి చెట్ల చీనీ కాయలు రాలిపోతుంటే రైతు కుదేలవుతున్నారు. ఈ తెగులుకు ఏ మందుపిచికారీ చేసినా ప్రభావం చూపడం లేదని రైతులు అంటున్నారు. కళ్లముందే కాయలు రాలిపోతుంటే చూడలేక ఏదొక మందు పిచికారీ చేస్తే కాపు నిలుస్తుందనే ఆశతో రైతులు తాడిపత్రి, అనంతపురం తదితర చోట్ల నుంచి అధిక ధరలు వెచ్చించి పురుగుల మందులు తెచ్చి పిచికారీ చేస్తున్నారు.



చీనీ చెట్లకు కొమ్మ తెగులు

పరిష్కారం చూపాలి

ఉద్యాన శాఖ ఈ తెగులు నివారణకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు. చీనీ రైతులకు చీనీ చెట్లకు సోకిన తెగుళ్ల నివారణకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు చీనీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు కోరుతున్నారు. చీనీ రైతులను ఆదుకోవడంతోపాటు ఇన్సూరెన్స్ విధానాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టన్ను చీనీ కాయలు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఉండేదని, అలాగే అరటి కాయలు టన్ను రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకునే పరిస్థితిలో లేదని, గిట్టు బాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

ఎర్రగుంట్ల : స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా యర్రగుంట్ల మండల పరిధిలో తిప్పలూరు గ్రామంలో జెడ్పీ సీఈఓ ఓబుళలమ్మ సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు స్వచ్ఛత పై అవగాహన కల్పించాలన్నారు. ఇంటిలోని చెత్తను ప్రభుత్వ ఇచ్చిన డబ్బాలలో వేసి గ్రీన్ అంబాసిడలర్లుకు అందజేయాలన్నారు. గ్రామంలోని పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన మేరకు గ్రామ సచివాలయ సిబ్బంది వివిధ సర్వేలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేసేందుకు పంచాయతీ కార్యదర్శిలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ రామాజంనేయరెడ్డి , మండల ఎంపీడీఓ వెంకటరమణయ్య, డీప్యూటీ ఎంపీడీఓ రహమతుల్లయ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ

దార్శనికుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య



వేంపల్లె: మాట్లాడుతున్న పీఆర్ ఏఈఈ హరీష్

వేంపల్లె : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య దార్శనికుడని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కొనియాడారు. సోమవారం వేంపల్లి ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికీ చేసిన సేవలను భారత ప్రభుత్వం గుర్తించి భారతరత్నతో ఆయనను సత్కరించి ఆయన జయంతిని ఇంజనీర్స్ డే గా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుమన్, చంద్ర, రవి యాదవ్, జనసేన నాయకుడు మల్లికార్జున, లక్ష్మీనారాయణ, దేవా, మనోజ్‌రెడ్డి, జయచంద్రుడు, నందు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో..

ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ వేడుకలను జరిపారు. ముందుగా ప్రఖ్యాత ఇంజనీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పులివెందుల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరీష్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, డీన్ ఆఫ్ అకాడమిక్ రమేష్ కైలాస్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్, శరవణ కుమార్ సివిల్ బ్రాంచ్ హెచ్ ఓ డి ధనుంజయ విద్యార్థులు పాల్గొన్నారు.



చింతకొమ్మదిన్నె : మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి

ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

పులివెందుల రూరల్ : భారతరత్న, ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి.విష్ణువర్ధన్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శేష మహేశ్వరమ్మ, సివిల్, సీఎస్ఈ విభాగాధిపతులు సూర్యనారాయణరెడ్డి, మురళీ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పులివెందుల రూరల్ : జెఎన్‌టీయూలో..

మోక్షగుండం ప్రతి విద్యార్థికి ఆదర్శం

చింతకొమ్మదిన్నె : కడప నగరం రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంజినీర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. కడప ఆర్‌డబ్ల్యూఎస్ సూపరిండెంటెంట్ ఇంజినీర్ కె.ఏడుకొండలు, పంచాయతీరాజ్ ఇంజినీర్ ఎస్.మద్దన్న మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కేవలం ఒక ఇంజనీర్ కాదని, దేశాభివృద్ధికి మార్గదర్శకుడని కొనియాడారు. ఆయన ప్రణాళికబద్ధత, క్రమశిక్షణ, విజ్ఞానం, ప్రతి విద్యార్థికి ఆదర్శమన్నారు. నేటి యువ ఇంజినీర్లు విశ్వేశ్వరయ్య సాంకేతిక దృష్టిని, మౌలిక విలువలను అనుసరించి సమాజానికి సేవచేయాలని కోరారు. కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి. చందన, అధ్యాపక, సిబ్బంది పాల్గొన్నారు.